సాక్షి
మెదక్
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



అంతర్‌జిల్లా దొంగ అరెస్టు

ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తున్న అంతర్‌జిల్లా దొంగను సిద్దిపేట పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు 8లో ▸



సామూహిక సీమంతాలు

శివ్వంపేటలోని అంగన్‌వాడీ-1 కేంద్రంలో శనివారం సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. వివరాలు 9లో ▸



కొప్పోల్ ఆలయం ముస్తాబు

కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. వివరాలు 9లో ▸

నిబంధనలకు పాతర

ఏడుపాయలలో మొక్కుబడి పనులు

- అందినకాడికి పంచుకుంటున్న నాయకులు
- గతేడాది జాతరకు రూ. 2 కోట్లు మంజూరు
- రూ. 2.28 కోట్ల బిల్లుల సమర్పణ
- తాత్కాలిక పనులతోనే సరి..



ఏడుపాయల జాతర

పాపన్నపేట(మెదక్): 'ఏడుపాయల జాతరలో కేవలం డెకరేషన్, వీడియో కవరేజీ, సాంగ్ రికార్డింగ్, లైటింగ్ తదితర ఏర్పాట్లకు రూ. 75 లక్షలు ఖర్చు అయ్యాయి' అంటే.. ఏ మేర నిధులు విచ్చలవిడిగా ఖర్చు అవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. జాతర నిధులు వెల్లువలా పారుతుండగా.. నిబంధనలకు పాతరేసి అధికారులు, నాయకులు అందినకాడికి పంచుకుంటున్నారు. ఏటా ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ. 2 కోట్లు.. తాత్కాలిక పనులకే హారతి కర్పూరమవుతున్నాయి. మట్టి కొట్టు.. ట్యాంకర్లు పెట్టు.. పెస్టలు పట్టు అన్నట్లు స్థానిక నాయకులు పోటీ పడి మొక్కుబడి పనులు చేస్తున్నారు. పనికి తగిన చెల్లింపులు చేయాల్సిన డిపార్ట్‌మెంట్ అధికారులు కమీషన్లకు ఆశపడి వారికి అనుకూలంగా ఎంబీ రికార్డులు చేస్తున్నారు. గతేడాది జాతరకు రూ. 2 కోట్లు మంజూరు కాగా, అధికారులు రూ. 2,28,16,117 బిల్లులు రికార్డు చేసి మంజూరు చేయాలంటూ సిఫారసు చేశారు. అయితే కలెక్టర్ బిల్లులు పునః పరిశీలించి వాటిని రూ. 1,99,79,795కు కుదించి మంజూరు చేశారు.

2016 నుంచి నిధులు విడుదల

రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన ఏడుపాయల జాతరకు 2016 నుంచి ప్రత్యేక నిధులు విడుదల చేస్తున్నారు. అప్పటి నుంచి ఏటా పెంచుతూ ప్రస్తుతం రూ. 2 కోట్లు మంజూరు చేస్తున్నారు. ఏటా జాతరలో కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చేలా తాత్కాలిక పనులే చేపడుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఈ నిధులను సంబంధిత శాఖల అధికారులు ఎగ్జిక్యూట్ చేస్తుంటారు. కానీ ఇక్కడ చేసేది మాత్రం అధికార పక్షంలో ఉన్న నాయకులు మాత్రమే. గతేడాది డెకరేషన్, వీడియో కవరేజ్, తాగునీరు, సానిటేషన్, బారికేడ్లు, తాత్కాలిక ఘాట్లు, పార్కింగ్, ఫ్లెక్సీలు, క్యూలైన్లు తదితర పనులకు సుమారు రూ. 1.50 కోట్లు ఖర్చు అయినట్లు చూపారు. ఇందులో కర్రలతో చేసే బారికేడింగ్ కోసం గత 8 ఏళ్ల నుంచి చేస్తున్న ఖర్చుతో, పర్మనెంట్‌గా మంజీరా చుట్టూ ఇనుప రాడ్లు వేసి జాలి వేయొచ్చని పలువురు భక్తులు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే ప్రతిఏటా అధికారుల కోసం వేసే షెడ్లు, తాత్కాలికంగా నిర్మించే టాయిలెట్ల బదులు పర్మనెంట్‌వి ఏర్పాటు చేయొచ్చని అభిప్రాయపడుతున్నారు.

జాతర పనుల్లో అవినీతి



జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం ఇస్తున్న నిధుల్లో అవినీతి జోరుగా సాగుతుంది. అధికారంలో ఉన్న నాయకులు జాతర పనులు మొక్కుబడిగా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. వచ్చే జాతర నాటికి ఈ పనుల జాడ కనిపించడం లేదు. కలెక్టర్ స్పందించి జాతర పనుల్లో అవినీతి జరగకుండా చర్యలు తీసుకోవాలి.

- సంతోష్, బీజేపీ మండల నాయకుడు

ఆడిట్‌తో అవకతవకలకు చెక్



జాతర నిధుల్లో అవకతవకలు జరుగకుండా అధికారులు చేసిన రికార్డులను జిల్లా కలెక్టర్ మరోసారి పునః పరిశీలన చేసి బిల్లులు మంజూరు చేస్తారు. దీనిపై తిరిగి ఏజీ ఆడిట్ ఉంటుంది

- చంద్రశేఖర్ ఈఓ, ఏడుపాయల

న్యూస్‌రీల్

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



ఎన్నికల ప్రచారంలో బీబీ పాటిల్

పెద్దశంకరంపేట(మెదక్): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, ఆ పార్టీ గెలవడం కష్టమన్నారు. అనంతరం గొట్టిముక్కులలో ఆత్మలింగ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పత్రి రామకృష్ణ, మండల అధ్యక్షుడు కోణం విఠల్, నాయకులు శ్రావణ్, కృష్ణ, సుధాకర్, సాయిలు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వినూత్న నిరసన



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే తాము ఎలా బతికేదని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కార్మికులతో కలిసి మండల కేంద్రంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. తమతో నిత్యం పనులు చేయించుకుంటున్నారు, గాని జీతాల గురించి మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. మహాశివరాత్రికి ఏడుపాయలకు వెళ్లాలని అధికారులు చెబుతున్నారని.. జీతాలిస్తేనే వెళ్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు స్వామి, అంజయ్య, అర్జున్, రాములు, బాలమణి, నవనీత, శోభ, లక్ష్మి, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, సూరి, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు ఉండొద్దు

ఆర్డీఓ రమాదేవి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

టేక్మాల్(మెదక్): త్వరలో జరగబోయే పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లకు ఇబ్బందులు కల్గనివ్వొద్దని ఆర్డీఓ రమాదేవి తెలిపారు. శనివారం టేక్మాల్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం చేయరాదన్నారు. అన్ని రకాల వసతులను కల్పించాలని సూచించారు. ఓటు ఉన్న ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో తహసీల్దార్ తులసీరామ్, ఆర్‌ఐ సాయిశ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

150 మందికి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు



క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తూప్రాన్: మున్సిపల్ పరిధిలో శనివారం ప్రజలకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కొన్ని రోజులుగా దగ్గు, దమ్ము, బరువు తగ్గుదల, జ్వరంతో బాధపడుతున్న 150 మందిని గుర్తించి వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యులు జ్యోత్స్న, సమత పేర్కొన్నారు. ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదన్నారు. పైన పేర్కొన్న లక్షణాలతో బాధపడుతున్న వారు వెంటనే వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలతో పాటు మందులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీహెచ్‌ఓ బాల నర్సయ్య, సూపర్‌వైజర్లు శారద, పల్లవి, సిబ్బంది దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాసిపెట్టి ఉండాలి

దర్జా బతుకు..!

- కుక్కలకు పెరుగుతున్న క్రేజ్
- కుటుంబంలో ఒకటిగా స్థానం కల్పిస్తున్న పెట్ లవర్స్
- ఇంటి రక్షణ కోసం పెంపకం
- జాతిని బట్టి రూ.వేల నుంచి రూ.లక్షల్లో ఖరీదు
- పెట్ క్లబ్‌లకూ భలే డిమాండ్
- మంచి ఆహారం, కాస్మోటిక్స్, బాతింగ్



సండే స్పెషల్

వివరాలు 8లో ▸

'ఏం బతుకురా నీది.. కుక్క బతుకు' అని చాలా తేలిగ్గా మాట్లాడుతాం. ఈ తిట్టుకు ఇప్పుడు అర్థం మార్చేస్తోంది ఆధునిక సమాజం. పూట కూడా గడవని మనుషులు ఒకవైపు.. విలాసాలకు అలవడిన ధనికులు మరోవైపుగా చీలిపోతున్న సమాజంలో పెంపుడు కుక్కలకూ మనషుల జీవనశైలి అలవాటు చేస్తోంది. ఇప్పుడు కుక్కలు పార్కులకు వెళ్తాయి.. స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడతాయి..వాటికి నచ్చిన ఆహారం తింటాయి.. ఉదయాన్నే బయటికి వెళ్లి షికార్లు కొడతాయి. పుట్టిన రోజులు కూడా చేసుకుంటాయి. తోటి కుక్కలతో కలసి పార్టీలు చేసుకుంటాయి. మనిషి, శునకాల జీవనశైలికి అంతగా తేడాలేకుండా పోతుందని ఆశ్చర్యపడుతున్నారా? అవును.. రూ.లక్షలు ఖర్చు చేసి మరీ వాటి బాగోగులు చూస్తున్నారు. డాగ్ లవర్స్ అనే పరిధి దాటి పెట్ పేరెంట్స్‌గా చెప్పే స్థాయికి చేరుకుంది ఎలైట్ సొసైటీ. పెట్‌ను పెంచుకోవడమంటే వారి కుటుంబంలోకి ఓ వ్యక్తిని ఆహ్వానించినట్లే.. మరి ఆ అతిథిని వీరంతా ఎలా చూసుకుంటున్నారనే దానిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– పర్వ శ్రీనాథ్, రామచంద్రాపురం(పటాన్‌చెరు)

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

డీపీఎం మోహన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): సరైన పోషకాహారాలు భుజిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తామని డీపీఎం మోహన్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లోని ఐకేపీ కార్యాలయంలో మహిళలకు పోషకాహారాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారంతోనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. పరిశుభ్రమైన పదార్థాలతో, పరిశుభ్రంగా వంటలు చేసుకోవాన్నారు. చిన్నారులకు సరైన పోషకాహారాలు అందజేస్తేనే, వారు సరైన రీతిలో ఎదుగుతారన్నారు. మహిళల్లో రక్తహీనత సమస్య రాకుండా తీసుకోవాల్సిన పోషకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రేమలత, సీసీలు నర్మ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, ఆయా గ్రామ సంఘాల అధ్యక్షులు, ఆరోగ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణాపూర్(మెదక్): మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రం హవేళిఘణాపూర్ మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరును సరుకుల నిల్వ, అకౌంట్ రిజిష్టార్లను పరిశీలించిచారు. ప్రతిరోజూ సమయపాలన కచ్చితంగా పాటించాలని తెలిపారు. అలాగే సరుకుల నిల్వ గదిని పర్యవేక్షించి, కూరగాయలు, ఆకుకూరలు, బియ్యం బస్తాలను, గుడ్ల నాణ్యతను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వంట గదిని పరిశీలించి, పరిశుభ్రత చర్యలను అనుసరించాలని, వండే విధానంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించి, ప్రతిరోజూ మెనూ ప్రకారం వంట చేయాలని, పోషకాలతో కూడిన శుచిరుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం 9 వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి సమావేశమయ్యారు. వారికి అందించే భోజనం, తదితర సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వెనుక పడి ఉన్న ఏదేని సబ్జెక్టులపై ఎక్కువ శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందోబస్తు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని, క్షేత్రస్థాయిలో పోలీస్ స్టేషన్లో పోలింగ్ బూతుల వద్ద పరిస్థితుల వివరాలను సేకరించాలని సూచించారు. జిల్లాలో 21 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వాటికి ఆయుధాలు కలిగిన ఎనిమిది రూట్ మొబైల్ పార్టీలు విధులు నిర్వహిస్తాయన్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో క్యూఆర్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్‌లు ఎల్లప్పుడు పోలింగ్ కేంద్రాలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 26న జరగబోయే ఏడుపాయల వన దుర్గామాత జాతర సందర్భంగా సూచనలు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, ట్రాఫిక్ డైవర్షన్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. శివరాత్రి సందర్భంగా భక్తులు ఏడుపాయల ప్రాంగణంలోనే నిద్రిస్తారు. కాబట్టి రాత్రి సమయంలో మఫ్టీ పార్టీలు, క్యూఆర్టీ పార్టీలు పెట్రోలింగ్ నిర్వహించి దొంగతనాలు జరగకుండా చూడాలన్నారు. స్నానపు ఘాట్ల వద్ద అతిఉత్సాహంతో కొందరు లోతు ప్రదేశాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తారు. కాబట్టి వారిని హెచ్చరించి ప్రమాదాలను నివారించాలి. ఆకతాయిల చర్యలను నివారించడానికి షీ టీం బృందాలు, మఫ్టీ పార్టీలు ఎల్లప్పుడు నిఘా ఉంచాలని సూచించారు.

కమనీయం... కల్యాణోత్సవం



స్థానిక శివాలయంలో శనివారం శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. పూజారి వీరప్పగురుస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం పంపిణీ చేశారు. - నర్సాపూర్

కులగణన ఘనత కాంగ్రెస్‌దే..

మెదక్‌ను చార్మినార్ జోన్‌లో కలిపేందుకు చర్యలు

- నరేందర్‌రెడ్డిని పెద్దల సభకు పంపాలి
- మంత్రులు దామోదర, కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మెదక్‌జోన్: దేశంలో ఇప్పటి వరకు కులగణన చేసిన రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని.. ఆ ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన హాజరై, మాట్లాడుతూ... సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీ తీర్మానం చేశామన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్‌దే కీలకపాత్రని అన్నారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని చెప్పి 56 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. నిరుద్యోగులు, విద్యావేత్తల కోరిక మేరకు మెదక్‌ను చార్మినార్ జోన్‌లో కలిపేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. వచ్చే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. నరేందర్‌రెడ్డి విద్యావంతుడని.. అలాంటి వ్యక్తిని పెద్దల సభకు పంపాలని పిలుపునిచ్చారు. ఎంపీ రఘునందన్‌రావు ఒక్క రూపాయి నియోజకవర్గ అభివృద్ధికి తీసుకురాలేదన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీకి మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మిగిలింది గాడిద గుడ్డేనన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచటంతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేశామన్నారు. బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే రాష్ట్రంలో చేసేది ఏమి ఉండదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మెన్ చంద్రపాల్, నేతలు హఫిజొద్దీన్, చౌదరి శ్రీనివాస్, జీవన్‌రావు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆవాసం'.. పేద విద్యార్థులకు వరం

నేడు 19వ వార్షికోత్సవం



ఆవాస విద్యాలయం

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని ఆవాస విద్యాలయం నిరుపేద విద్యార్థులకు వరంగా మారింది. 2006లో ప్రారంభమైన పాఠశాల ఇంతింతై వటుడింతైనట్లు దినదినాభివృద్ధి చెందుతుంది. పేద విద్యార్థుల్లో వెలుగులు నింపుతుంది. వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుంది. ఆదివారం 19వ వార్షికోత్సవం జరుపుకోనున్న సందర్భంగా ప్రత్యేక కథనం..ట్రాన్స్‌కో మాజీ ఉద్యోగి కృష్టారెడ్డి సేవాభారతి సంస్థ ద్వారా ఈ పాఠశాలను ప్రారంభించారు. మొదట్లో కేవలం 10 మందితో ప్రారంభం కాగా.. నేడు 60 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. కృష్టారెడ్డి సేవాభావాన్ని ప్రత్యక్షంగా చూసిన కొందరు దాతలు స్వచ్ఛందంగా విరాళాలు అందజేస్తూ విద్యాలయం అభివృద్ధికి తోడ్పడుతున్నారు. కొంద రు ప్రవాస భారతీయులు సైతం విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తున్నారు. ఇందులో చదువుకుంటున్న వారంతా ప్రతిభ ఉన్న నిరుపేదలే. ఇక్క డ కుల మతాలకు తావు లేదు. అన్నివర్గాల వారు ఈ విద్యాలయంలో చదువుకుంటున్నారు. కాగా తల్లిదండ్రులు లేని పిల్లలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. మిగతా విద్యార్థుల అడ్మిషన్ల కోసం ఏటా పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసుకుంటున్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబ పరిస్థితులను ప్రత్యక్షంగా చూసిన తర్వాతే విద్యాలయంలో చేర్చుకుంటున్నారు. వారికి భోజనంతో పాటు దుస్తులు, దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి అందజేస్తున్నారు.

యోగా, కర్రసాములో శిక్షణ

ఇందులో చదువుతున్న విద్యార్థులకు దేశభక్తి విషయమై ప్రత్యేకంగా బోధించడంతో పాటు చదువు, సంస్కారం నేర్పుతారు. విద్యార్థులు సమాజంలో తమ బాధ్యతలను గుర్తెరిగి ముందుకు సాగే విధంగా తర్ఫీదు ఇస్తున్నారు. వీటితో పాటు కర్ర సాము, యోగాలో శిక్షణ ఇస్తున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు గుర్తింపు పొందారు.

రోడ్డు ప్రమాదం ముగ్గురికి తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం మండలంలోని శాలిపేటకు చెందిన వ్యక్తి టిప్పర్‌ను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. ఇదే సమయంలో మెదక్ నుంచి వస్తున్న ఇద్దరు వ్యక్తులు కిందపడిపోయిన బైక్‌ను ఢీ కొని ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో కళాశాల సిబ్బంది పవన్ కాలు, ఉమర్ చేయి విరిగింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.

క్లుప్తంగా

చిరుత దాడిలో దూడ మృతి


దూడ కళేబరం వద్ద బాధిత రైతు

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణ శివారులో చిరుత దాడి చేసి దూడను హతమార్చింది. మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామానికి చెందిన రైతు స్వామి తన పశువులను వ్యవసాయ బావి వద్ద ఉంచగా, రాత్రి చిరుత దాడి చేసి హతమార్చింది. స్వామి ఉదయం పొలానికి వెళ్లి చూడగా, హతమైన దూడ కనిపించింది. సమీపంలో చిరుత పాదముద్రలు ఉండటంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశాడు. రైతులు జాగ్రత్తగా ఉండాలని, ఒకరిద్దరు వెళ్లకుండా కలిసి కట్టుగా వెళ్లాలని రేంజీ అధికారి విద్యాసాగర్ సూచించారు.

బస్సు డ్రైవర్ చాకచక్యం

నాచగిరి వద్ద ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ
ప్రయాణికులకు తప్పిన ముప్పు


ఘటనా స్థలంలో టిప్పర్, ఆర్టీసీ బస్సు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి వద్ద శనివారం ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. స్థానికులు, బస్సు డ్రైవర్ రబ్బాని తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు శనివారం మధ్యాహ్నం ప్రయాణికులతో గజ్వేల్ నుంచి సంగారెడ్డికి బయల్దేరింది. నాచగిరి క్షేత్రం బ్రిడ్జి వద్దకు చేరేసరికి ఎదురుగా వస్తున్న ఓ టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో వాహనాలు స్వలంగా దెబ్బతిన్నాయి. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

యువకుడి మృతి

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. న్యాల్‌కల్ గ్రామానికి చెందిన నాగరాజు(30) జహీరాబాద్‌లో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం కుప్పానగర్ గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి బయల్దేరిన నాగరాజు ఊరికి చేరుకుని రోడ్డుపక్కనే వాహనం నిలుపుతుండగా...జహీరాబాద్ వైపు నుంచి మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో నాగరాజుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఖేలో ఇండియాకు విజ్ఞాన్ విద్యార్థులు


సౌత్‌జోన్ పోటీలకుఎంపికైన విద్యార్థులు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఖేలో ఇండియా ఆటల పోటీలకు సౌత్‌జోన్‌కు స్థానిక విజ్ఞాన్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఖేలో ఇండియా ఆటలకు సంబంధించి రాష్ట్రస్థాయి పోటీల్లో భావిక, సాయిశృతి, వైష్ణవి, హరిచందనలు గెలుపొందారని పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌గౌడ్, ప్రిన్సిపాల్ అనురాధ,వైస్ ప్రిన్సిపాల్ సిద్ధన్న శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

రాసి పెట్ ఉండాలి

దర్జా బతుకు..!



● కుక్కలకు పెరుగుతున్న క్రేజ్ ● ప్రత్యేక నిపుణులతో శిక్షణ


రామచంద్రాపురం(పటాన్‌చెరు): పెట్ లవర్స్ సిటీలో ఈ పదానికి ఒక క్రేజీ ఏర్పడింది. మనుషులే కాకుండా వారి జీవితాల్లో సాధు జంతువులను మమేకం చేసుకుంటూ ఆత్మీయంగా పెంచుతున్నారు. నిత్య జీవితంలో ఎంత బిజీ ఉన్నప్పటికీ మూగజీవాలపై తన వంతు మమకారాన్ని చూపిస్తున్నాడు. అందుకోసం ఎంత ఖర్చు చేయడానికైనా వెనుకాడడం లేదు. వేలాది రూపాయలతో కొనుగోలు చేయడమే కాకుండా విలాసమైన జీవితాన్ని అందిస్తున్నారు. వారి స్థాయికి తగ్గట్టుగా విలాసమైన సౌకర్యాలను కల్పించి సంబురపడుతున్నారు. దానికి చిన్న అనారోగ్య సమ్యస వచ్చినా తట్టుకోలేని పరిస్థితికి వచ్చాడంటే ఆ మూగ జీవాలపై ఎంత బంధం పెంచుకున్నాడో అర్థమవుతుంది.

పెరుగుతున్న డిమాండ్

చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వారి ఇళ్లలో పెట్స్ పెంచుకోవడానికి ఎంతో ఆసక్తి చూపుతున్నారు. దీంతో మేలు జాతి డాగ్‌లను విక్రయించేందుకు అనేక మంది ముందు కొస్తున్నారు. చాలా మంది ప్రశాంతత కోసం పెట్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. మరి కొంత మంది ఇంటి రక్షణ కోసం పెట్స్‌ను పెంచుతున్నారు. ఈ క్రమంలో మేలు జాతి డాగ్‌లకు రోజురోజుకూ మంచి డిమాండ్ పెరుగుతుంది.


డాగ్‌లకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్

పలు జాగ్రత్తలు తీసుకోవాలి



కుక్కలు పుట్టిన తర్వాత 15రోజుల నుంచి 3నెలల వరకు ప్రతీ 15రోజుల కొకసారి, 3 నుంచి 6నెలల వరకు ప్రతీ నెల నట్టలమందు తాగించాలి. 7 ఇన్ వాన్ వ్యాక్సిన్ కుక్కలకు ముఖ్యమైంది. పుట్టిన 45రోజులు దాటాక మొదటి వ్యాక్సిన్, ఆ తర్వాత 3 వారాలకు రెండో వ్యాక్సిన్ ఇవ్వాలి. ఇవి ప్రతీ ఏటా క్రమం తప్పకుండా ఇవ్వాలి. –డా.వంశీ కృష్ణారెడ్డి, పశువైద్య సహాయ శస్త్రచికిత్సకుడు, రామచంద్రాపురం


పెట్స్ క్లబ్‌లో బోర్డింగ్‌లో సేద తీరుతున్న డాగ్స్

జోరుగా పెట్ క్లబ్‌లు

అనేక మంది పెట్స్‌ను పెంచుకోవడానికి ఆసక్తిని చూపడంతో మార్కెట్‌లో అందుకు అనుగుణంగా పెట్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పెట్స్‌కు సంబంధించిన ఆహార పదార్థాలు, గొలుసులు, షాంపులు, బొమ్మలు, టీ షాట్స్, హెర్ కట్టింగ్‌లతోపాటు వాటి బాతింగ్, స్విమ్మింగ్ చేయిస్తారు. ఎవరైనా దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి డాగ్‌లకు ఇక్కడే బోర్డింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అందుకు గంటకు రూ.50, రోజుకు రూ.800 చార్జీ చేస్తారు. దానికి ఏసీ గదితోపాటు ఆహారం అందిస్తారు. ఈ క్రమంలో పెట్ క్లబ్‌లకు మంచి డిమాండ్ వచ్చింది.


పెంపుడు దాగులతో యజమాని

జాతిని బట్టి ఖరీదు

ఇళ్లలో పెంచుకొనే పెట్స్ జాతిని బట్టి ధర ఉంటుంది. డాగ్స్‌లో సుమారు 360 జాతులు ఉండగా అందులో స్నేహపూర్వకంగా ఉంటే డాగ్స్ మాత్రమే మంచి డిమాండ్ ఉంది. వాటిలో కొన్ని జాతి డాగ్‌లను మాత్రమే ఎంచుకుంటున్నారు. అందులో ప్రధానం ల్యాబ్ జాతి పిల్ల రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు నుంచి లభిస్తుంది. గోల్డెన్ రిట్రీవర్ జాతి డాగ్ రూ.20 వేల నుంచి నాణ్యతను బట్టి రూ.80 వేల వరకు లభిస్తుంది. జర్మన్ షెపర్డ్ రూ.10 వేల నుంచి నాణ్యత బట్టి రూ.60 వేల వరకు లభిస్తుంది. పూడ్లే జాతి డాగ్ రూ.80 వేల నుంచి రూ.1.5 లక్ష వరకు లభిస్తుంది. హస్కీ జాతీ డాగ్ రూ.60 వేల నుంచి మొదలవుతుంది. విదేశీకి చెందిన జాతి డాగ్‌లు రూ.3 లక్షలపై ధర ఉంటుందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

శిక్షణ కేంద్రాలు, తప్పిపోతే ప్రకటనలు

ఇళ్లలో పెంచుకునే పెట్స్‌కు ప్రతేక్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అందరితో స్నేహంగా ఉండేందుకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. నెల రోజులు శిక్షణ కోసం రూ.25 వేల నుంచి రూ.35 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. శిక్షణ పొందిన కుక్కలు అందరి దగ్గరికి వెళ్తుంటాయి. ఇంటి వాళ్లని తొందరగా గుర్తిస్తుంటాయి. ఎవరిపైనా దాడి చేయకుండా ఉంటాయి. ఒక వేళ ఇంట్లోని పెంపుడు డాగ్ తప్పిపోతే అందుకు ప్రకటనలు సైతం చేస్తున్నారు. డబ్బు ఎంతైన ఖర్చు చేస్తున్నారు. దానిని వెతికి తెచ్చిన వారికి బహుమతులు సైతం అందజేస్తున్నారు.

ఎంతో ఉపాధి లభిస్తుంది



అనేక మంది పెట్స్‌ను పెంచుకోవడం వల్ల అనేక మందికి ఉపాధి లభిస్తుంది. నేను కోవిడ్ సమయంలో మిత్రుల డాగ్స్‌తో ఆడుకుంటూ దానిని వృత్తిగా మార్చుకున్నాను. తెల్లాపూర్‌లో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పిస్తున్నాను. మా శిక్షణ కేంద్రంలో డాగ్స్ మెరుగైన శిక్షణ అందిస్తున్నాం.

– గాంధీ కృష్ణయాదవ్, డాగ్ శిక్షణ కేంద్రం నిర్వాహకుడు

హ్యాపీ అని పేరు పెట్టాం



మాకు, మా బాబుకి మా హ్యాపీ అంటే ఎంతో ప్రాణం. షిహ్ త్జు జాతికి చెందిన డాగ్‌ను మూడేళ్ల కిందట రూ.20 వేలు పెట్టి కొన్నాం. ఇప్పుడు అది మాలో ఒక్కటి. ఇవి ఎంతో విశ్వాసంతో ఉంటాయి. దానితో మేము ఆడుకుంటాం. ఎవరిపైన దాడి చేయదు. డాగ్‌కు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం.

– సాయి, విద్యుత్‌నగర్

ఇంటి ఆవరణలోనే పూడ్చిపెట్టాం

డాగ్‌లకు ఎంతో విశ్వాసం ఉంటుంది. అందుకే అవి అంటే నా ఎంతో ఇష్టం. మేము పెంచుకున్న డాగ్ కొన్ని నెలల కిందట చనిపోయింది. దాని నుంచి కోలుకోవడం కోసం ఎంతో సమయం పట్టింది. దానిని మా ఇంటి ఆవరణలోనే పూడ్చిపెట్టాం. దాని గుర్తుగా మొక్కలను పెంచుతున్నాం.

– ప్రియాంక, రామచంద్రారెడ్డినగర్

కొన్ని జాతులు.. వాటి ధరలు



సమోయెడ్ – స్నేహపూర్వక ప్రవర్తనకు ప్రసిద్ధి. తెల్లని వెంట్రుకలతో అందంగా ఉంటాయి. వీటి ధర రూ.45 నుంచి రూ.1.30లక్షల వరకు ఉంటుంది. ధర ఎక్కువైనా వీటికి మార్కెట్‌లో భలే డిమాండ్ ఉంది. కొనుగోలు చేసేందుకు పోటీ పడుతుంటారు.

ఇంగ్లిష్ బుల్‌డాగ్– బుల్‌డాగ్స్‌గా పిలుచుకునే విలక్షమైన జాతి కుక్కలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఇవి ప్రత్యేకమైన రూపాన్ని కలిగి ఉంటాయి. వీటి ధర మార్కెట్లో రూ.40వేల నుంచి రూ.70వేల వరకు ఉంటుంది.

ఆఫ్ఘన్ హౌండ్– ఇవి చూడటానికి వింతగా కన్పిస్తాయి. ఒకానొక సందర్భంలో అసలు ఇవి కుక్కలేనా అన్న సందేహమూ కలుగుతుంది. పొడవాటి మెడను, సిల్కీ వెంట్రుకలను కలిగి ఉండే వీటికి మార్కెట్‌లో రూ.60వేల నుంచి రూ.80వేల వరకు ధర పలుకుతుంది.



సైబీరియన్ హస్కీ– ఈ జాతికి చెందిన కుక్కలు నీలి కళ్లతో ఉంటాయి. వీటిని చాలామంది ఇష్టపడతారు. వీటి ధర దాదాపు రూ.40వేల నుంచి రూ.70వేల వరకు ఉంటుంది.


పెట్ క్లబ్‌లో డాగ్స్‌కు సంబంధించిన ఆహార పదార్థాలు

రోట్ వీలర్– ఈ జాతికి చెందిన డాగ్స్ అత్యంత శక్తివంతమైనవి. విశ్వాసమైనవి కూడా. కేసులను చేధించేందుకు పోలీసులు వీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. వీటి ధర రూ.10వేల నుంచి రూ.80వేల వరకు ఉంటుంది.



టిబెటిన్ మాస్టిఫ్– ఇవి చూడటానికి చాలా పెద్దగా, గంభీరంగా కనిపిస్తాయి. మందపాటి చర్మంతో భయానకంగా కనిపించే డాగ్స్ అత్యంత అరుదుగా దొరుకుతాయి. దేశంలోనే అత్యంత ఖరీదైన, అరుదైన జాతుల్లో ఇవి ఒకటి. వీటి ధర రూ.60వేల నుంచి రూ.2.50లక్షల వరకు ఉంటుంది.

అప్రజాస్వామిక విధానాలపై ప్రశ్నిస్తాం

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి విజ్ఞప్తిసంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జ్ఞాన మంజరి

ఎడ్యుకేషన్: విద్యా వ్యాపారులను ఓడించి, ఉపాధ్యాయ ఉద్యమ నేత అశోక్‌కుమార్‌ను గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి విజ్ఞప్తి చేశారు. శనివారం సంగారెడ్డిలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానమంజరి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలోకి పోటీలోకి వచ్చిన రియల్ ఎస్టేట్ విద్య వ్యాపారులను ఓడించి ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడైన వై. అశోక్ కుమార్‌ని గెలిపించాలని కోరారు. ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ప్రశ్నించి ఎండబెట్టడానికి పెద్దల సభకి ఉద్యమ నాయకుడి పంపించడం అవసరమని కోరారు. టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు కోశాధికారి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సాయి తేజ, జిల్లా కమిటీ సభ్యులు వెంకయ్య పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

● 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
● ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్


నిందితుడిని చూపుతున్న ఏసీపీ మధు, సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తున్న అంతర్ జిల్లా దొంగను టూటౌన్ పోలీసులు అరెస్టుచేసి, అతడి నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొన్నారు. ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. పట్టణంలోని టెలికమ్ నగర్‌కు చెందిన దయానంద్ తన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని కొద్ది రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వారు నర్సాపూర్ డబుల్ బెడ్రూంలకు వెళ్లే రాజీవ్ రహదారిపై అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన ఆస సుదర్శన్ కొద్ది రోజులుగా పట్టణంలో పలు చోట్ల ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లుగా ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు గతంలో వివిధ కేసులలో జైలుకు వెళ్లి వచ్చినట్లు చెప్పారు. దీంతో నేరస్థుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ మధు, సీఐ ఉపేందర్ తెలిపారు. కీలకంగా వ్యవహరించిన క్రైం కానిస్టేబుళ్లు కనకరాజు, ప్రశాంత్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌ను అభినందించి, నగదు రివార్డు అందజేశారు.

380 కుట్టు మెషీన్లు ఉచిత పంపిణీ


మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న సచిన్, లక్ష్మారెడ్డి

జహీరాబాద్: పేదలు స్వయం ఉపాధిని పొంది వారి కాళ్లపై వారు నిలబడేందుకుగాను కుట్టు శిక్షణ పొందిన 380 మంది మహిళలకు కోల్ ఇండియా సంస్థ ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేసింది. ఈ మేరకు ఆ సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సచిన్ శనివారం మీడియాకు వెల్లడించారు. జహీరాబాద్‌లోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జి అండ్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు వీటిని అందజేసినట్లు తెలిపారు. సంస్థ సాధిస్తున్న లాభాల్లో కొంత సొమ్మును దేశ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను కేటాయిస్తున్నట్లు చెప్పారు. జహీరాబాద్‌లో వికాస్ సంస్థ తరపున శిక్షణ పొందిన 560 మందికి ఇప్పటివరకు రెండు విడతల కింద ఉచితంగా కుట్టు మెషీన్లను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కె.లక్ష్మారెడ్డి, వికాస్ సంస్థ డైరెక్టర్లు శుక్లవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సబ్ కోఆర్డినేటర్ రాంచంద్రారెడ్డి, శిక్షకులు, మహిళలు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని మల్లన్నగండికి చెందిన కటికె మహేశ్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. 3వవార్డులో నివసిస్తున్న మహేశ్ ఈనెల 18న జగ్గిర్గిగుట్టలోని బంధువుల వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి శనివారం వచ్చేసరికి ఇంటికి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, 20 తులాల వెండి, రూ.20వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ పాండు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


అంబయ్య (ఫైల్)

జిన్నారం (పటాన్‌చెరు): మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం .. మున్సిపాలిటీలోని దోమడుగు గ్రామానికి చెందిన ఏరు అంబయ్య (44), గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి ఇబ్బంది పడుతున్నాడు. ప్రతిరోజు బయటకు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి వచ్చేవాడు. ఈనెల 10న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు వెతికినా ఆచూకీ దొరకలేదు. శనివారం అంబయ్య వదిన వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదం ముగ్గురికి తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం మండలంలోని శాలిపేటకు చెందిన వ్యక్తి టిప్పర్‌ను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. ఇదే సమయంలో మెదక్ నుంచి చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో విధులు నిర్వహించేందుకు వస్తున్న ఇద్దరు వ్యక్తులు కిందపడిపోయిన బైక్‌ను ఢీ కొని ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో కళాశాల సిబ్బంది పవన్‌కాలు, ఉమర్ చేయి విరిగింది. విషయం గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో తీవ్రగాయాలకు గురైన వారిని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చనిపోతున్నా.. ‘పిల్లలు జాగ్రత్త...!

● భార్యకు ఫోన్ చేసి ఆత్మహత్య
● నందిగామలో విషాదం


ప్రదీప్(ఫైల్)

నిజాంపేట(మెదక్): పిల్లలు జాగ్రత్త.. నేను చనిపోతున్నా'అని భార్యకు ఫోన్ చేసి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి నిజాంపేట మండలం నందిగామలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెర్ల ప్రదీప్(35) లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. అనారోగ్యం కారణంగా అప్పుల పాలయ్యాడు. ఆరోగ్యం కుదుటపడకపోగా అప్పుల సమస్య మరింత పెరిగిపోయి మానసికంగా కుంగిపోయాడు. తన తండ్రి అనారోగ్యం కారణంగా భార్య ఏసుమణి కామారెడ్డి జిల్లా ముత్యంపేటలోని తల్లిగారింటికి మూడు రోజుల క్రితం వెళ్లింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రదీప్ భార్యకు ఫోన్ చేశబూడు. ‘పిల్లలు జాగ్రత్త... నేను చనిపోతున్నా'అని చెప్పి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆందోళన చెందిన భార్య,, తల్లిగారింటి నుంచి వచ్చి చుట్టూ పక్కల వారి సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే విగతజీవిగా కనిపించాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కార్పొరేట్లకు రాయితీలా?: సీఐటీయూ



మాట్లాడుతున్న మల్లికార్జున్

మెదక్ కలెక్టరేట్: కేంద్రబడ్జెట్‌ను రైతు, కార్మికులకు అనుకూలమైన సవరణలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ, పేదల సంక్షేమ పథకాలకు కోతలు పెట్టేదిగా ఉందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యతా అంటూనే, రైతు రుణమాఫీ పథకం, ధరల స్థిరీకరణ చట్టానికి ప్రాధాన్యతా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఉపాధి కల్పనకు నిధులు కేటాయించాలని, కనీస వేతనాలకు గ్యారెంటీ ఇచ్చి, కార్మికుల, ప్రజల కొనుగోలు శక్తిని పెంచేదిగా కేంద్ర బడ్జెట్ లో సవరణలు చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, గౌరయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లేశం, బాలమణి, నాగరాజు, నాయకులు సంతోష్, నరేందర్, వెంకట్, సత్యం, శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బగ్గీల తనిఖీలు


ఎలక్ట్రిక్ బగ్గీతో ట్రాక్టర్‌ను లాగుతున్న ఈ బగ్గీ డ్రైవర్

నర్సాపూర్: స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో జరుగుతున్న జాతీయ ఈ– బాహా సే ఇండియా–2025 పోటీల్లో భాగంగా శనివారం ఎలక్ట్రిక్ బగ్గీల తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా బగ్గీల రూపకల్పన, కంప్యూటర్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ పరీక్షలు, రెయిన్‌స్టామ్ పరీక్షలు, నీటి గుంటలలో బగ్గీలు నడిపినప్పుడు సర్క్యూట్ సిస్టం పనితీరు, బ్యాటరీ సిస్టం సురక్షితను, నీటిలో నడపగల సామర్థ్యం వంటి పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో మారుతి సుజుకీ చీఫ్ టెక్నాలజీ అధికారి, ఈ–బాహా సే ఇండియా ప్రెసిడెంట్ సీవీరామన్ పాల్గొని విద్యార్థి బృందాలతో మాట్లాడారు. ఈవెంట్ నిర్వహణ, దాని ప్రాముఖ్యతను, ఎలక్ట్రికల్ వాహన రంగంలో తన అనుభవాలను ఆయన వారికి వివరించారు. ఈ బాహా సే పోటీలలో పాల్గొంటున్న విద్యార్థుల బృందానికి అసాధారణమైన మార్గదర్శకత్వం ప్రదర్శించిన అధ్యాపక సలహాదారునికి పోటీల చివరిరోజు ద్రోణాచార్య అవార్డును అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.